



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 299 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 16-02-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

# పాక్‌ను చిత్తు చేసిన భారత్

- అర్థ సెంచరీతో మెరిసిన ఇషాన్ కిషన్
- బుమ్రా, హార్దిక్, అక్షర్, వరుణ్ మ్యాజిక్
- తడబడినా.. పడగొట్టారు
- భారత్ 175/7, పాకిస్తాన్ 114/10

## 61 పరుగులతో భారత్ గెలుపు

కొలంబో ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

పాకిస్తాన్‌పై భారత్ ఘన విజయం సాధించింది. గ్రూప్-ఏలో కొలంబోలో జరిగిన మ్యాచ్‌లో పాక్‌పై 61 పరుగుల తేడాతో గెలుపొందిన భారత్.. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో సూపర్‌ఎయిట్ బెర్త్ ఖాయం చేసుకుంది. ఇషాన్ కిషన్ (77, 40 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ అర్థ సెంచరీతో చెలరేగటంతో తొలుత భారత్ 175/7 పరుగులు చేసింది. సూర్యకుమార్ యాదవ్ (32, 29 బంతుల్లో 3 ఫోర్లు), శివం దూబె (27, 17 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), తిలక్ వర్మ (25, 24

-మిగతా 2 లో





# శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

- రాష్ట్రవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి.. కిక్కిరిసిన వేములవాడ, కీసర ఆలయాలు
- యాదగిరిగుట్టలో శతరుద్రాభిషేకాలు
- ఓరుగల్లులో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ
- వేలాల గట్టుమల్లన్న గుడి వద్ద విషాదం
- గుట్టపైకెళ్తూ గుండెపోటుతో భక్తుడి మృతి

హైదరాబాద్ ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

మహా శివరాత్రి సందర్భంగా ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు దాదాపు లక్ష మంది భక్తులు తరలివచ్చారని అధికారుల అంచనా. రాజన్న ఆలయాన్ని విస్తరణ పనుల్లో భాగంగా మూసివేయడంతో భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాసతో కలిసి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

-మిగతా 2 లో

# నేను పాలకుడిని కాదు.. సేవకుడిని

## మాకు సేవ చేయడానికే ప్రజలు అవకాశం ఇచ్చారు

- దళితులకు మూడు మంత్రి పదవులు, స్పీకర్ ఇచ్చాం
- అచ్చంపేటలో సంత్ సేవాలాల్ పుణ్యక్షేత్రం 20 ఎకరాల్లో నిర్మాణం
- ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేస్తామని హామీ
- సేవాలాల్ జయంతిని అధికారికంగా చేయడం తమ ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం
- చదువుతోనే ధనవంతులు : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న సీఎం రేవంత్

హైదరాబాద్ ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

తాము పాలకులం కాదు సేవకులమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తమకు సేవ చేయడానికే ప్రజలు అవకాశం ఇచ్చారని తెలిపారు. పాలకుడిగా తాను ఎప్పుడూ ప్రవర్తించలేదని, సేవకుడిగా మాత్రమే వ్యవహరిస్తున్నట్టు చెప్పారు. నేనే రాజు నేనే మంత్రి వ్యాఖ్యలను వక్రీకరించారని చెప్పారు. గెలుపు ఓటమి అన్నింటికీ తానే బాధ్యత తీసుకుం టానని చెప్పానన్నారు. వివిధ వర్గాలను పరిపాలనలో

-మిగతా 2 లో







# రైతులకు ద్రోహమే

- వ్యవసాయ సార్వభౌమత్వాన్ని రాజీ పడేలా చేస్తుంది
- ఇది అన్నదాతల భవిష్యత్తుకు సంబంధించిన విషయం
- కేంద్రం తీరుపై రాహుల్ తీవ్ర ఆగ్రహం
- అమెరికాతో ట్రేడ్ డీల్‌పై ప్రధానికి ఐదు ప్రశ్నలు

న్యూఢిల్లీ

అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోన్న తీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వాణిజ్య ఒప్పందం పేరుతో భారతీయ రైతులు మోసపోవడాన్ని కండ్లారా చూస్తున్నామనీ, దేశ వ్యవసాయ సార్వభౌమత్వాన్ని రాజీ పడేలా చేస్తోందని ఉద్ఘాటించారు. ఇది తాత్కాలిక అంశం కాదనీ, రైతుల భవిష్యత్తుకు సంబంధించిందన్న ఆయన.. ఈ సందర్భంగా ప్రధాని మోడీకి ఐదు ప్రశ్నలు సంధించారు. "డ్రైడ్ డిస్టిల్లర్స్ గ్రెయిన్స్ (డీడీజీ) దిగుమతి చేసుకోవడం అంటే ఏమిటీ? జన్యుమార్పిడి చేసిన (జీఎం) అమెరికన్ మొక్కజొన్న నుంచి తయారైన దాణాను భారతీయ పశువులకు తినిపించడం కాదా? ఇది మన పాల ఉత్పత్తి అమెరికా వ్యవసాయ పరిశ్రమపై ఆధారపడేలా చేయదా? జన్యుమార్పిడి చేసిన సోయాబీన్ ఆయిల్‌ను అనుమతిస్తే.. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్తాన్‌లతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న సోయాబీన్ రైతులపై ప్రభావం పడదా? మీరు చెబుతున్న

-మిగతా 2 లో



# బంగ్లాదేశ్‌కు ఓం బిర్లా..

- ఈ నెల 17న బంగ్లా ప్రధానిగా తారిఖ్ రహమాన్ ప్రమాణ స్వీకారం
- తారిఖ్ రహమాన్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఇండియా తరపున హాజరు
- ఈ వేడుకకు పలు దేశాలకు చెందిన నేతలను బంగ్లా ప్రభుత్వం ఆహ్వానం
- పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా హాజరు

న్యూఢిల్లీ

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా బంగ్లాదేశ్ వెళ్లనున్నారు. అక్కడ ఈ నెల 17న బంగ్లా ప్రధానిగా తారిఖ్ రహమాన్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఓంబిర్లా దేశ ప్రతినిధిగా హాజరుకానున్నారు. ఇటీవల బంగ్లాదేశ్‌లో పార్లమెంట్ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో బీఎన్‌పీ అధికారం చేజిక్కించుకుంది. ఈ పార్టీ తరఫున తారిఖ్ రహమాన్ బంగ్లాదేశ్ ప్రధానిగా ఎన్నికకానున్నారు.ఆయన ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ నెల 17న జరగనుంది. ఈ వేడుకకు పలు దేశాలకు చెందిన నేతలను బంగ్లా ప్రభుత్వం ఆహ్వానించింది. మన ప్రధాని నరేంద్ర మోదీకి కూడా బంగ్లా ఆహ్వానం పంపింది.

-మిగతా 2 లో

# క్షీణించిన ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం..

- జైలు నుంచి రహస్యంగా ఆస్పత్రికి తరలింపు
- ఇమ్రాన్ ఖాన్ అనారోగ్యంపై ఆందోళన
- జైలులో ఆయనపై పలు రకాల దాడులు జరిగాయనే ప్రచారం
- ఖాన్ ఆరోగ్య స్థితిపై అధికారిక ప్రకటన మాత్రం వెలువడ లేదు

న్యూఢిల్లీ ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

పాక్ మాజీ ప్రధాని, పీటీఐ పార్టీ అధినేత ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం క్షీణించినట్లు తెలుస్తోంది. దీంతో ఆయనను జైలు అధికారులు దగ్గర్లోని ఒక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై అధికారిక ప్రకటన లేనప్పటికీ.. పీటీఐ (పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్) పార్టీ నేతలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నారు.

-మిగతా 2 లో



# నేడు ఏపీకి బిల్‌గేట్స్ రాక

- పరిపాలనలో టెక్నాలజీ వినియోగంపై పరిశీలన
- స్వర్ణాంధ్ర విజన్‌పై సీఎం ప్రెజెంటేషన్

అమరావతి

: మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకులు, మిలిందా గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్‌గేట్స్ సోమవారం రాష్ట్రానికి రానున్నారు. తన ఫౌండేషన్ ద్వారా చేపడుతున్న పనులను పరిశీలించనున్నారు. అలాగే రాజధాని పరిధిలోని ఉండవల్లిలో ఆధునిక పద్ధతుల్లోనూ, టెక్నాలజీ ఉపయోగించి సాగుచేస్తున్న కళ్లం నరేంద్రరెడ్డి నర్సరీ సమీపంలో ఎంపిక చేసిన పొలాలను పరిశీలించనున్నారు. ఆయన పొలం పక్కనే గేట్స్ పర్యటనకు వీలుగా ఏర్పాట్లు చేశారు. పర్యటనలో భాగంగా ఉదయం 10 గంటలకు విజయవాడ చేరుకుని అక్కడ నుండి నేరుగా సచివాలయానికి వెళ్తారు. అక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్.. గేట్స్‌తో చర్చించనున్నారు.


-మిగతా 2 లో



# పీఠం ఎవరికో?

## ఉత్కంఠగా మేయర్, చైర్మెన్ల ఎన్నిక

- డిప్యూటీ మేయర్, వైస్ చైర్మెన్ పోస్టులపైనా ఆసక్తి
- జనరల్ స్థానాల్లో విపరీతమైన పోటీ
- రిజర్వేషన్ స్థానాల్లో 'డిప్యూటీ' పోస్టులకు క్రేజ్
- హంగ్ పరిస్థితులు ఉన్న చోట సవాల్‌గా ఎంపికలు
- క్యాంపుల్లో విజేతలు..సర్దిచెప్పే పనిలో నేతలు



**నేడు కొలువు దీరనున్న మున్సిపల్ నూతన పాలకవర్గాలు**

ఖమ్మం ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ చివరి అంకానికి చేరింది. రాష్ట్రంలో 116 మున్సిపాలిటీలు, ఏడు నగరపాలక సంస్థల పాలకవర్గాలు సోమవారం కొలువుదీరనున్నాయి. పాలకవర్గం ప్రమాణ స్వీకారానికి మున్సిపాలిటీల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చైర్ పర్సన్స్, చైర్మెన్, మేయర్లు... ఇతర పాలకవర్గ సభ్యుల చేత కమిషనర్లు ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఎన్నికైన వార్డు సభ్యులు, కార్పొరేటర్లు అందరూ సోమవారం ఉదయం 11:00 గంటలకు పదవీ ప్రమాణం చేస్తారు.

-మిగతా 2 లో

# సింగరేణి కార్మికుల కోసం పోరాటం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్ ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సింగరేణిలో జరుగుతున్న దోపిడీని అడ్డుకోవడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. సింగరేణి కార్మికుల ప్రయోజనాల దృష్ట్యా కొత్తగూడెంలో బీఆర్ఎస్ తన మద్దతు సీపీఐకి ప్రకటించిందని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ రెండూ కలిసి సింగరేణి

-మిగతా 2 లో




# ఇరాన్‌పై యూఎస్ మరింత ఒత్తిడి!

- చైనాకు చమురు ఎగుమతులు కుదించాలి
- ట్రంప్-నెతన్యాహు నిర్ణయం

వాషింగ్టన్ :

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహులు వైట్‌హౌస్‌లో జరిగిన భేటీలో కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇరాన్‌పై 'గరిష్ట ఒత్తిడి' (మ్యాగ్జిమమ్ ప్రెషర్) విధానాన్ని మరింత కఠినతరం చేయాలని ఇరువురు నేతలు అంగీకరించినట్టు నివేదికల సమాచారం. ముఖ్యంగా ఇరాన్ నుంచి చైనాకు జరిగే చమురు ఎగుమతులను తగ్గించే దిశగా అమెరికా పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఇరాన్ చమురు విక్రయాలపై, ముఖ్యంగా చైనాకు వెళ్లే సరఫరాలపై పూర్తి శక్తితో ఒత్తిడి తీసుకురావాలని ఇరువురు నేతలు అంగీకరించారని అమెరికా అధికారులు వివరించారు. ప్రస్తుతం ఇరాన్ నుంచి చమురు ఎగుమతుల్లో 80 శాతానికి పైగా చైనా వాటా ఉన్నది. ఈ వాణిజ్యం తగ్గితే.. ఇరాన్‌కు వచ్చే చమురు ఆదాయం గణనీయంగా పడిపోతుంది. దీంతో ఇరాన్‌పై పైచేయి సాధించే చర్యల్లో భాగంగానే అమెరికా- ఇజ్రాయిల్ అధినేతలు ఇలాంటి నిర్ణయం తీసుకున్నారని అంతర్జాతీయ నిపుణులు భావిస్తున్నారు.



# రైతులకు ద్రోహమే

మొదటి తరువాయి

ఆ 'అదనపు ఉత్పత్తులు' అంటే ఏమిటీ..? కాలక్రమేణా పప్పుధాన్యాలతోపాటు ఇతర అమెరికన్ పంటల దిగుమతులకు ద్వారాలు తెరవడమేనా? వాణిజ్యేతర అడ్డంకులను తొలగించడం అంటే ఏమిటీ? జన్యుమార్పిడి పంటలపై తన వైఖరిని మార్చడం, ధాన్యం సేకరణను తగ్గించడం, కనీస మద్దతు ధర లేదా బోనస్‌లను తగ్గించడంపై భవిష్యత్తులో భారత్ ఒత్తిడిని ఎదుర్కోనుందా? ఒకసారి ద్వారాలు తెరిచిన తర్వాత వీటిలో మరిన్ని పంటలను చేర్చకుండా ఎలా ఆపగలం? వీటికి ఏమైనా రక్షణ చర్యలు ఉన్నాయా? లేదా ఇలాగే ప్రతి ఒప్పందంలో మరిన్ని పంటలను ఈ జాబితాలో చేరుస్తారా?" అని రాహుల్ గాంధీ కేంద్రాన్ని ప్రశ్నించారు. భారత వ్యవసాయ రంగంపై మరో దేశం పట్టును సాధించేందుకు అనుమతి ఇస్తున్నామా? అని ఈ సందర్భంగా అనుమానం వ్యక్తం చేశారు.

# బంగ్లాదేశ్‌కు ఓం బిర్లా..

మొదటి తరువాయి

ఢాకాలో జరిగే రహమాన్ ప్రమాణ స్వీకారానికి అతిథిగా హాజరుకావాలని కోరింది. అయితే, అదే రోజు ప్రధాని మోదీకి వేరే కార్యక్రమం ఉంది. ఫ్రెంచ్ ప్రెసిడెంట్ ఇమాన్యుయెల్ మ్యాక్రాన్ ఇండియాలో పర్యటించనున్నారు. ఆయనను 17న మోదీ ముంబైలో కలుస్తారు. ఇది చాలా రోజుల క్రితమే ఫిక్సైంది. అందువల్ల మోదీ.. బంగ్లాదేశ్ వెళ్లలేరు. ఈ నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లా ఈ కార్యక్రమానికి ఇండియా ప్రతినిధిగా, అధికారికంగా హాజరవుతారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. రహమాన్ ప్రమాణ స్వీకారానికి ఓం బిర్లా హాజరు కావడం ఇరు దేశాల సంబంధాలకు, ప్రజాస్వామ్య విలువలకు అద్దం పడుతోందని, బంగ్లాకు భారత ప్రాధాన్యాన్ని తెలియజేస్తుందని కేంద్రం తెలిపింది. ఇక ఇండియా నుంచి ఓం బిర్లా హాజరుకానుండగా, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా హాజరవుతున్నారు. ఇండియా, పాక్‌లతోపాటు చైనా, సౌదీ అరేబియా, టర్కీ, యూఏఈ, ఖతార్, మలేసియా, బ్రూనే, శ్రీలంక, నేపాల్, మాల్దీవ్స్, భూటాన్‌లకు కూడా బంగ్లాదేశ్‌లోని యూనస్ ప్రభుత్వం ఆహ్వానం పలికింది. ఇటీవల జరిగిన బంగ్లా ఎన్నికల్లో 297 సీట్లకుగాను.. 209 సీట్లలో బీఎన్‌పీ విజయం సాధించింది.

# క్షీణించిన ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం..

మొదటి తరువాయి

ఇమ్రాన్ ఖాన్ అనారోగ్యంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగష్టు నుంచి రావల్పిండిలోని అడియాలా జైలులో ఉన్నారు. ఆయనను కలిసేందుకు ఇటీవల కుటుంబ సభ్యులను కూడా అనుమతించడం లేదు.ఆయన అనారోగ్యం పాలయ్యారనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా కంటి చూపు చాలా వరకు కోల్పోయారని, అలాగే జైలులో ఆయనపై పలు రకాల దాడులు జరిగాయనే ప్రచారం జరుగుతోంది. కానీ, దీనిపై ప్రభుత్వం నుంచి సరైన స్పష్టత రాలేదు. ఇదే సమయంలో ఇటీవల ఇమ్రాన్ ఆరోగ్యం బాగా క్షీణించిందని ప్రచారం మొదలైంది. ఈ నేపథ్యంలోనే ఆయనను తాజాగా ఒక ఆస్పత్రికి రహస్యంగా తరలించి చికిత్స అందిస్తున్నారు. కానీ, కుటుంబ సభ్యులకు ఈ విషయాన్ని అధికారులు చెప్పలేదు. ఎవరికీ తెలియకుండా చికిత్స అందించడంపై ఇమ్రాన్ స్థాపించిన పీటీఐ పార్టీకి చెందిన నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయన ఆరోగ్యం విషయంలో కావాలనే పాక్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఆయన ప్రాణానికే ప్రమాదం ఉందని ఆరోపిస్తున్నారు. ఇమ్రాన్‌కు ఏ చికిత్స అందించినా ఆయన కుటుంబ సభ్యుల అనుమతితో, ఫ్యామిలీ డాక్టర్ సమక్షంలోనే అందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు ఇమ్రాన్ ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకే వస్తుందన్నారు. మరోవైపు త్వరలోనే ఇమ్రాన్‌ను త్వరలో ఇస్లామాబాద్‌లో నూతనంగా నిర్మించనున్న జైలుకు తరలిస్తామన్నారు. రెండు నెలల్లో ఆ జైలు నిర్మాణం పూర్తవుతుందని, అక్కడ మెరుగైన వైద్య సదుపాయం అందుబాటులో ఉంటుందని పాక్ మంత్రి ఒకరు తెలిపారు. మరోవైపు ఖాన్ ఆరోగ్య స్థితిపై అధికారిక ప్రకటన మాత్రం వెలువడ లేదు. తనకు కనీస వసతి సౌకర్యాలు కల్పిస్తే చాలని ఆయన ఇటీవల జైలులో కోరినట్లు తెలుస్తోంది.

# నేడు ఏపీకి బిల్‌గేట్స్ రాక

మొదటి తరువాయి

అనంతరం ఆర్‌టిజిఎస్‌కు చేరుకుంటారు. ప్రభుత్వ పరిపాలనలో సాంకేతిక పద్ధతుల వినియోగంపై ఆర్‌టిజిఎస్ ద్వారా పరిశీలించనున్నారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, రియల్‌టైం మానిటరింగ్ వంటి అంశాలను అక్కడ బిల్‌గేట్స్‌కు సీఎం, అధికారులు వివరించనున్నారు. ఇటీవల వాట్సాప్ ద్వారా నేరుగా అందిస్తున్న సేవలనూ తెలపనున్నారు. ముఖ్యంగా రాష్ట్రం ముందుకు తీసుకొచ్చిన స్వర్ణాంధ్ర విజన్-2047 పాలసీపై సిఎం చంద్రబాబు.. గేట్స్‌కు వివరించనున్నారు. అనంతరం పెనుమాక, ఉండవల్లి పరిధిలో సిఎం కార్యాలయానికి సమీపంలో ఉన్న పొలాల్లో ఆధునిక పద్ధతుల్లో నర్సరీ సాగు చేస్తున్న కళ్లం నరేంద్రరెడ్డి పొలానికి వెళతారు. అక్కడ నర్సరీ పెంపకంలో డ్రోన్స్, సాంకేతిక వినియోగం వంటి అంశాలను నేరుగా బిల్‌గేట్స్ పరిశీలించి తిరుగుపయనం అవుతారు. అక్కడ నర్సరీలో గేట్స్ ప్రత్యక్షంగా తిరిగేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. బిల్‌గేట్స్ రాక సందర్భంగా సచివాలయాన్ని సర్వాంగ సుందరంగా తయారుచేశారు. అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డును మందడం వరకూ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.ఎడిసిఎల్, సిఆర్‌డిఏ అధికారులందరూ ఈ పనుల్లో నిమగమయ్యారు. ఏర్పాట్లపై కమిషనర్ కన్నబాబు నేరుగా పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం సాయంత్రం సెక్రటేరియట్, సీడ్ యాక్సెస్ రోడ్డు, పెనుమాక పరిధిలో గేట్స్ సందర్శించనున్న పొలాన్ని పరిశీలించారు. అయితే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా గేట్స్ రాష్ట్రానికి రావడం ఇది మూడోసారి కావడం విశేషం.

# సింగరేణి కార్మికుల కోసం పోరాటం

మొదటి తరువాయి

దోపిడీలో భాగస్వాములై సంస్థను నష్టపరిచే విధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. సీపీఐ కాంగ్రెస్ ఇప్పటికే అలయన్స్ లో ఉన్నాయనీ, కొత్తగూడెంలో మేయర్ పదవి పంచుకోవడంలో ఆశ్చర్యమేమీ లేదన్నారు. ఏఐటీయూసీ ఈ పొత్తును ఎందుకు అంగీకరించిందో తెలియదన్నారు. దాని వెనుక ఏ ఒత్తిళ్లు పని చేశాయో తాను చెప్పలేనని వ్యాఖ్యానించారు. అయితే ఎవరు కలిసి వచ్చినా, కలిసి రాకపోయినా సింగరేణి సంస్థ ప్రయోజనాలు, కార్మికుల హక్కుల కోసం గతంలో ఎట్లా పోరాడామో భవిష్యత్తులో కూడా అలాగే పోరాడుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో దాదాపు 34 చోట్ల హంగ్ పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఆ ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ, కార్పొరేటర్లు, కౌన్సిలర్లను ఎత్తుకుపోవడం, ప్రలోభపెట్టడం, పోలీసులను ఇంటింటికి పంపించడం, గూండాలను ఉపయోగించడం వంటి చర్యలు జరుగుతున్నాయన్నారు. సేవాలాల్ మహారాజ్ 287వ జయంతిని తెలంగాణ భవన్‌లో ఘనంగా జరుపుకోడం ఆనందంగా ఉందని కేటీఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్, భుక్యా జాన్సన్ రాథోడ్, వాల్యా నాయక్, రామచంద్రు నాయక్, రాంభల్, గాంధీ నాయక్, కరాటే రాజు, శ్రీనివాస్ గౌడ్ తదితర నేతలతో కలిసి భోగ్ భండార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.

# పాక్‌ను చిత్తు చేసిన భారత్

మొదటి తరువాయి

బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఛేదనలో పాకిస్తాన్ 18 ఓవర్లలోనే చేతులెత్తేసింది. భారత బౌలర్లు సమిష్టిగా విజృంభించారు. హార్దిక్, బుమ్రా, వరుణ్, అక్షర్ రెండేసి వికెట్లు పడగొట్టగా పాకిస్తాన్ 114 పరుగులకే కుప్పకూలింది. పాక్ తరఫున ఉస్మాన్ ఖాన్ (44, 34 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), షహీన్ షా అఫ్రిది (23 నాటౌట్, 19 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. ఇషాన్ కిషన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. భారత్ గ్రూప్ దశలో ఆఖరు మ్యాచ్‌లో బుధవారం నెదర్లాండ్స్‌తో తలపడుతుంది.

**పాక్ పేకమేడలా..**

176 పరుగుల ఛేదనలో పాకిస్తాన్ చతికిల పడింది. స్పిన్‌కు అనుకూలించే పిచ్‌పై పేస్‌తో వికెట్ల వేట మొదలెట్టిన భారత్ ఆ దిశగా విజయవంతమైంది. హార్దిక్ ఓవర్లో ఫర్హాన్ (0) డకౌట్ కాగా.. బుమ్రా ఓవర్లో ఆయుబ్ (6), సల్మాన్ (4) నిష్క్రమించారు. 2 ఓవర్లలో 13/3తో పాకిస్తాన్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది. అక్షర్ పటేల్ మాయకు బాబర్ ఆజమ్ (5) బోల్తా పడటంతో పాక్ ఓటమి కోరల్లో పడింది. పవర్‌ప్లేలో ఆ జట్టు 38/4తో డీలా పడగా మ్యాచ్ భారత్ చేతుల్లోకి వచ్చేసింది. ఈ దశలో ఉస్మాన్ ఖాన్ (44), షాదాబ్ ఖాన్ (14) భారత బౌలర్లను ఎదురించే ప్రయత్నం చేశారు. పది ఓవర్లలో 71/4తో నిలువగా.. బ్యాటర్లపై తీవ్ర ఒత్తిడి పడింది. దూకుడుగా ఆడేందుకు యత్నించిన పాక్ బ్యాటింగ్ లైనప్ పేక మేడలా కుప్పకూలింది. షహీన్ షా అఫ్రిది (23 నాటౌట్) పాక్ ఓటమి అంతరానికి కుదించాడు. 18 ఓవర్లలో పాకిస్తాన్ 114 పరుగులకు కుప్పకూలింది. భారత్ 61 పరుగుల తేడాతో గెలుపొందింది. భారత బౌలర్లలో హార్దిక్ పాండ్య (2/16), బుమ్రా (2/17), అక్షర్ పటేల్ (2/29), వరుణ్ చక్రవర్తి (2/17) రెండేసి వికెట్లు పడగొట్టారు. తిలక్ వర్మ (1/11), కుల్‌దీప్ యాదవ్ (1/14) రాణించారు.

# శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

మొదటి తరువాయి

ఖమ్మం జిల్లాలోని పలు శివాలయాల్లో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల పేరిట భట్టి పూజలు నిర్వహించారు. తుమ్మల బుగ్గపాడు విశ్వధర్మ క్షేత్రంలో మహానంది ప్రతిష్టలో పాల్గొన్నారు. కీసరగుట్టకు కూడా భక్తులు పోటెత్తారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుల దివ్యక్షేత్రంలో శ్రీపర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వర ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. నాగార్జున సాగర్ జలాశయం మధ్యలో ఉన్న ఏలేశ్వరం కొండకు మహాశివరాత్రి ఒక్క



రోజే పర్యాటక శాఖ ఆధ్వర్యంలో లాంచీలు నడుపుతుండడంతో తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో వరంగల్‌లోని ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయం కిటకిటలాడింది. హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం వేదికగా ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగ దివ్య దర్శనం ఏర్పాటు చేశారు. మంత్రి కొండా సురేఖ నగరంలో దేవాలయాలను సందర్శించారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం వనదుర్గమ్మ క్షేత్రంలో ఏడుపాయల జాతర వైభవంగా ప్రారంభమైంది. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం వేలాల గట్టు మల్లన్న జాతరలో విషాదం చోటుచేసుకుంది. కుటుంబసభ్యులతో జాతరకు వచ్చిన అదే జిల్లాకు చెందిన బింగి రాజేందర్(45) అనే భక్తుడు గుట్టపైకి ఎక్కుతూ గుండెపోటుతో మృతిచెందాడు.

# నేను పాలకుడిని కాదు.. సేవకుడిని

మొదటి తరువాయి

భాగస్వాములను చేయాలనే ఆలోచన తనదని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఎస్సీలు 17 శాతం ఉంటే తమ ప్రభుత్వంలో 30 శాతం ఉన్నారన్నారు. దళితులకు మూడు మంత్రి పదవులు, స్పీకర్ ఇచ్చామన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసి వారికి మేలు చేశామన్నారు. సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన ఈ మేరకు మాట్లాడారు. సేవాలాల్ జయంతిని అధికారికంగా చేయడం తమ ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అచ్చంపేట అడవుల్లో 20 ఎకరాల్లో సంత్ సేవాలాల్ పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అచ్చంపేటలో 20 ఎకరాల్లో సంత్ సేవాలాల్ పుణ్యక్షేత్రం నిర్మిస్తున్నట్టు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ పుణ్యక్షేత్రాన్ని వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 15 నాటికి పూర్తి చేసి ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో నిర్వహించిన సంత్ సేవాలాల్ 287వ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. పుణ్యక్షేత్రం నిర్మాణం కోసం క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ముఖ్యమంత్రి రోడ్లు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. తన ప్రజా జీవితంలో జెడ్పీటీసీగా విజయం సాధించడం మొదలు ముఖ్యమంత్రిగా తాను కొనసాగుతున్న క్రమంలో 20 ఏండ్లలో లంబాడాలు తనకు అండగా నిలిచారని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఇందిరాగాంధీ హయంలో ల్యాండ్ సీలింగ్‌ను తెచ్చి భూములను పంచారనీ, అదే విధంగా ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం పంచేందుకు ప్రభుత్వం వద్ద భూములు లేవనీ, దేశాన్ని ఏలేందుకు ఏ చదువులు ఎంత చదువుకున్నా తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన సోషల్, ఎకనామిక్, క్యాస్ట్ సర్వేను ఆయన ప్రస్తావిస్తూ, గతంలో మాదిరిగా భూములుంటేనే ధనవంతులనే పరిస్థితి లేదని తెలిపారు. చదువుకుంటేనే ధనవంతులుగా మారుతున్నారని ఆ సర్వేలో గమనించినట్టు చెప్పారు. భూములు, తాత్కాలిక సంక్షేమం మరిచి బంజారాలు చదువుకోవాలని సీఎం సూచించారు. చదువే వారి భవిష్యత్తును మారుస్తుందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో, పునర్నిర్మాణంలో లంబాడాల పాత్ర తీసివేయలేనిదని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. సురేష్ నాయక్, కవితా నాయక్ తదితరుల ఆత్మ బలిదానాలు చేశారని ఆయన ఉదహరించారు. వారికి సంక్షేమంలో, అభివృద్ధిలో, ప్రభుత్వ పాలనలో సముచిత భాగస్వామ్యం, గౌరవం దక్కాల్సి ఉందన్నారు. ప్రతి తండాకు బీటీ రోడ్లను వేసేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి గిరిజన సంక్షేమశాఖ మంత్రినీ, ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రతి తండాలో పాఠశాల భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. అటవీ నిబంధనలు అడ్డుగా ఉన్న తండాల్లో విద్యుత్ సరఫరాకు సోలార్ ద్వారా అందించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఇప్పటికే అచ్చంపేటలో ప్రయోగాత్మకంగా 40 వేల పంప్ సెట్లకు సోలార్ విద్యుత్ ఇచ్చేందుకు ఎంపిక చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. గత ప్రభుత్వం 10 ఏండ్లు రేషన్ కార్డులు ఇవ్వలేదని ఆయన విమర్శించారు. తమ ప్రభుత్వం రేషన్ కార్డులతో పాటు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామనీ, దీంతో మార్కెట్‌లో గతంలో రూ.60 కేజీ ఉన్న సన్నబియ్యం ధర రూ.40కి పడిపోయిందని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం రూ.9 వేల కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. ఇండ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా, స్వయం సహాయక సంఘాలను వెయ్యి బస్సులకు యజమానులను చేశామనీ, వెయ్యి మెగావాట్ల సోలర్ ప్రాజెక్టును అప్పగించామనీ, హైటెక్ సిటీలో విలువైన భూమిని మహిళా సంఘాల ఉత్పత్తుల కోసం కేటాయించామనీ, హాస్టల్ బాలికలకు కాస్మొటిక్స్ ఛార్జెస్‌ను 200 శాతం పెంచినట్టు తెలిపారు. గ్రూప్స్‌తో పాటు ప్రభుత్వం చేపట్టిన 70 వేల నియామకాల్లో 85 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఉద్యోగాలు సాధించారని తెలిపారు.

# పీఠం ఎవరికో..?

మొదటి తరువాయి


ప్రమాణ స్వీకారం ముగిసిన వెంటనే, మధ్యాహ్నం 12:30 గంటలకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి మేయర్లు, డిప్యూటీ మేయర్లు (కార్పొరేషన్లలో), చైర్మెన్లు, వైస్ చైర్మెన్లను (మున్సిపాలిటీల్లో) ఎన్నుకుంటారు. ఫిబ్రవరి 11న జరిగిన పోలింగ్ ఫలితాలు 13న విడుదలయ్యాయి. ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యాన్ని కనబరిచింది. 116 మున్సిపాలిటీల్లో 64, 7 కార్పొరేషన్లలో నాలుగింటిని చేజిక్కించుకుంది. సుమారు 33 నుంచి 37 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ రాక హంగ్ ఏర్పడింది. బీఆర్ఎస్ 13 మున్సిపాలిటీలను కైవసం చేసుకుంది. కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్‌లలో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది.

**చైర్మెన్, మేయర్, ఇతర ముఖ్య పదవులపై ఆరా..!**

క్యాంపుల్లో ఉన్న విజేతలు, వారి తరపు బంధు, మిత్రులను మేయర్, చైర్మెన్‌తో పాటు డిప్యూటీ మేయర్, వైస్ చైర్మెన్ పదవులు ఎవరికి కేటాయిస్తున్నారనే విషయమై బయట నుంచి ఫోన్లు చేసి ఆరా తీస్తున్నారు. హంగ్ పరిస్థితులు ఉన్నచోట ఫోన్ల పైనా నిఘా ఉంచడంతో అక్కడి విషయాలు బయటకి రావటం ఒకింత కష్టంగా మారింది. అయినప్పటికీ వీలు చిక్కినప్పుడల్లా శిబిరాల్లో ఉన్నవారు క్యాంప్ విషయాలను బయటకు చేరవేస్తున్నారు. పార్టీలకు స్పష్టమైన మెజార్టీలు ఉన్నచోట అభ్యర్థులతో పాటు ఫోన్లు కూడా అనుమతించారు. అయితే చైర్మెన్, వైస్ చైర్మెన్ పదవుల విషయం బయటకు పొక్కకుండా చూసుకోవాలని ఒకటికి పది సార్లు సూచిస్తున్నారు.

**అసంతృప్తులకు బుజ్జగింపులు**

కొన్నిచోట్ల చైర్మెన్, మేయర్ క్యాండిడేట్లు ఎవరనేది ముందుగానే నిర్ణయమైనప్పటికీ... కొన్నిచోట్ల చైర్మెన్



అభ్యర్థులుగా నిర్ధారించిన వారు ఓటమి పాలయ్యారు. ఈ నేపథ్యంలో ఎవర్ని చైర్మెన్‌గా ఎంపిక చేస్తారనేది ఉత్కంఠ నెలకొంది. రిజర్వేషన్ స్థానాల్లో ఆ సామాజిక తరగతి నుంచి ముగ్గురు, నలుగురు గెలుపొందడంతో వారిలో ఎవర్ని పదవులు వరిస్తాయనే దానిపై ఆసక్తి ఉంది. ఒకరికి పదవి ఇస్తే మిగతావారిలో అసంతృప్తి నెలకొనే అవకాశం ఉన్న దృష్ట్యా అటువంటి వారిని బుజ్జగిస్తున్నారు. మరో విధంగా అవకాశాలు ఇద్దామని హామీలు ఇస్తున్నారు. ఇక్కడ సీనియార్టీతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేల ఆశీస్సులు ఉన్నవారిని పదవులు వరించే అవకాశం ఉంది. భవిష్యత్తు అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకొని ఈ పదవుల కేటాయింపులు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల ఆయా మున్సిపాలిటీలకు సంబంధించిన ఎమ్మెల్యేలు అంతో ఇంతో తీసుకుని పదవుల్లో ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలుస్తోంది. లేదంటే తమకు బాగా అనుకూలంగా ఉండేవారికి ప్రాధాన్యత ఇస్తున్నారని క్యాంపుల నుంచి అసంతృప్తి బయటకు పొక్కుతోంది.

**జనరల్ స్థానాల్లో తీవ్ర పోటీ**

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 121 మున్సిపాలిటీలు, 10 మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించిన రిజర్వేషన్లు ముందుగానే ప్రకటించారు. వీటిలో 116 మున్సిపాలిటీలు, 7 నగరపాలక సంస్థలకు ఎన్నికలు జరిగాయి. మున్సిపల్ చైర్మెన్, మేయర్ పదవుల్లో మహిళలకు 50 శాతం రిజర్వ్ చేశారు. మేయర్ పదవుల్లో కొత్తగూడెం -- ఎస్టీ జనరల్, రామగుండం -- ఎస్సీ జనరల్, మహబూబ్‌నగర్ -- బీసీ మహిళ, మంచిర్యాల, కరీంనగర్ -- బీసీ జనరల్, హైదరాబాద్, ఖమ్మం, నల్లగొండ, నిజామాబాద్ కార్పొరేషన్లను జనరల్ మహిళకు కేటాయించారు. గ్రేటర్ వరంగల్ అన్‌రిజర్వ్ చేశారు. రాష్ట్రంలో 121 మున్సిపాలిటీల్లో 5 ఎస్టీలకు, 17 ఎస్సీలకు, 38 బీసీలకు రిజర్వ్ చేశారు. మిగిలిన 61 పురపాలక సంఘాల్లో 31 జనరల్ మహిళలకు, 30 జనరల్‌కు కేటాయించారు. జనరల్, జనరల్ మహిళలకు కేటాయించిన మేయర్, చైర్మెన్ పదవులకు తీవ్ర పోటీ నెలకొన్నది. రిజర్వేషన్ స్థానాల్లో డిప్యూటీ మేయర్, వైస్ చైర్మెన్ పదవులకు విపరీతమైన పోటీ ఉంది. ఈ పదవులకు ఎలాంటి రిజర్వేషన్ లేకపోవడంతో ప్రతి ఒక్కరూ వీటిని ఆశిస్తున్నారు. తమకు ఏమైనా తక్కువ.. అనే రీతిలో వాదన చేస్తున్నారు. క్యాంపుల్లో వర్గాలుగా విడిపోయి ఈ పదవుల విషయంలో పోటీపడ్డారు. సమీకరణాలు, భవిష్యత్ రాజకీయ అవసరాలు, విశ్వసనీయత, విధేయత ఆధారంగా పదవులకు ఎంపికలు చేశారు.

# మహాశివరాత్రి పర్వదినాన పలు సేవా కార్యక్రమాలు









**కరీంనగర్/ హుస్నాబాద్ / వేములవాడ, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వాసవి వనిత ఏంజిల్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గీతా మందిరంలో భక్తులకు పండ్ల పంపిణీ జరిగింది. వాసవియన్ అధ్యక్షురాలు రావికంటి భాగ్యలక్ష్మి, కార్యదర్శి పల్లెర్ల విద్య, కోశాధికారి గుండ శ్రీదేవి, సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని శివునికి పాలాభిషేకం, పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పట్టు వస్త్రాలు సమర్పించారు. భీమేశ్వర ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేములవాడ ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం 150 కోట్ల రూపాయలతో పనులు చేపట్టిందని మంత్రి తెలిపారు. రాజన్న ఆశీర్వాదంతో ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. పందిళ్ల గ్రామంలోని శ్రీ మహాలింగేశ్వర స్వామి ఆలయంలో వాసవి క్లబ్ హుస్నాబాద్ గ్రేటర్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో 500 మంది భక్తులకు సిరా ప్రసాదం, అరటి పండ్ల పంపిణీ జరిగింది. స్వామి దర్శనానికి వచ్చిన ముస్లిం భక్తులకు కూడా ప్రసాదం అందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ నూక సంపత్ కుమార్, వాసవి క్లబ్ అధ్యక్షుడు వనపర్తి వంశీ, వనిత క్లబ్ అధ్యక్షురాలు చొల్లేటి లత, గ్రామ సర్పంచ్ తోడేటి రమేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మైలారం మల్లికార్జున స్వామికి వెండి బహుకరణ





**గన్నేరువరం, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గన్నేరువరం మండలంలోని మైలారం మల్లికార్జున స్వామి ఆలయానికి కరీంనగర్‌కు చెందిన విజయ్ మసాలా ఢ డ్రైఫ్రూట్స్ నిర్వాహకుడు అక్కేనపెల్లి రాజేష్ దంపతులు రెండు కిలోల వెండి శివలింగం, తోరణాన్ని బహుకరించారు. ఈ వెండి బహుకరణ విలువ సుమారు ఆరు లక్షల రూపాయలుగా ఉంది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వరాల పర్శరాములు వారిని ఒగ్గు డోలు చెప్పుల్లతో ఆహ్వానించారు. కార్యక్రమంలో చైర్మన్, వైస్ చైర్మన్, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

# ధర్మ బిక్షంగౌడ్ ఆశయ సాధనకై ఉద్యమిద్దాం

న్యాలపట్ల రాజు గౌడ్



**కరీంనగర్, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
:తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ధర్మ బిక్షం ఆశయాలను సాధించేందుకు ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త ఉద్యమించాలంటూ తెలంగాణ కల్లుగీత పనివారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాలపట్ల రాజు గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం ధర్మ బిక్షం 104వ జయంతి సందర్భంగా బద్దం ఎల్లారెడ్డి భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా న్యాలపట్ల రాజు మాట్లాడుతూ నిజాం నవాబుకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచి అనేక పోరాటాలు చేసిన మహనీయుడు ధర్మ బిక్షం అని కొనియాడారు. ఆయన విద్యార్థి ఉద్యమానికి నాంది పలికిన తొలి నాయకుడని, నిజాం పాలనలో వందేమాతరం ఉద్యమాన్ని ముందుకు నడిపారని, సాయుధ పోరాటంలో తుపాకీ చేత పట్టి యుద్ధరంగంలోకి దిగారని, ఐదు సంవత్సరాల పాటు జైలు జీవితం గడిపారని గుర్తుచేశారు. రెండుసార్లు శాసనసభ్యునిగా, పార్లమెంటు సభ్యునిగా పేదల సమస్యల పరిష్కారానికి ఆయన గొంతు వినిపించారని, కల్లుగీత కార్మికుల హక్కుల కోసం దున్నేవానిదే భూమి, గీసేవాడిదే చెట్టు అన్న నినాదంతో దేశవ్యాప్తంగా పోరాటాలు సాగించారని వివరించారు. ఆయన కృషి ఫలితంగానే ప్రమాదవశాత్తు చెట్టు పై నుండి పడిపోయిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా అమలు జరుగుతోందని తెలిపారు. ధర్మ బిక్షం రగిలించిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి దిక్సూచి అని, ఆయన ఆశయ సాధనకై ముందుండి పోరాటాలకు సిద్ధం కావాలని న్యాలపట్ల రాజు గౌడ్ పిలుపునిచ్చారు. జయంతి కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, కల్లుగీత పనివారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పైడిపల్లి రాజు గౌడ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు బోనగిరి మహేందర్, చంద్రశేఖర్ గౌడ్, రాహుల్ అరవింద్, సందీప్, వినయ్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# శివనామ స్మరణతో మారుమోగిన శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం




**పాలకుర్తి, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పాలకుర్తి మండలంలోని శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. "హరహర మహాదేవ శంభో శంకర" అంటూ ఆలయం శివనామ స్మరణతో మారుమోగింది. పాలకుర్తి, రామగుండం, అంతర్గాం మండలాల నుండి వేల సంఖ్యలో భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి శివుని దర్శనం చేసుకున్నారు. బసంతనగర్ సర్పంచ్ పర్షవేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమిటీ భక్తుల సౌకర్యం కోసం అన్ని ఏర్పాట్లు చేసింది. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఆయన సతీమణి మనాలి ఠాకూర్ దేవస్థానంలో శివునికి పాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామగుండం నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

# శివనామస్మరణలతో నిండిన పొట్లపల్లి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం



**హుస్నాబాద్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలోని స్వయంభూ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తుల రద్దీ కనిపించింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.ఎస్.ఆర్ కుటుంబసమేతంగా ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జె.ఎస్.ఆర్ మాట్లాడుతూ, మహాశివరాత్రి సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉంది. స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రైతులు పాడి పంటలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నాను, అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బత్తుల శంకర్ బాబు, కాయిత అరుణ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాస్, సంపత్, రాజు, రాజేందర్, రాం ప్రసాద్, సాయి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# చెత్త సమస్యతో అస్వస్థకు గురవుతున్న ప్రజలు





**హుస్నాబాద్ నియోజకవర్గం, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ పట్టణంలోని మల్లె చెట్టు చౌరస్తాలో స్వీట్ హౌస్ ముందు చెత్త సమస్య తీవ్రంగా మారింది. అక్కడ చెత్తకుండీలు లేకపోవడంతో ప్రజలు విచ్చలవిడిగా రోడ్డుపై చెత్తను పడేస్తున్నారు. చాలా రోజుల క్రితం అక్కడ చెత్త డబ్బాలు ఉండేవి, కానీ ఇప్పుడు లేకపోవడంతో చెత్త రోడ్డుపైనే పేరుకుపోతోంది. దీనివల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్త కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి చెత్తకుండీలు ఏర్పాటు చేసి, శుభ్రత చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# పాలకుర్తిలో ఫోటో వీడియోగ్రాఫర్స్ నూతన కార్యవర్గం ఏర్పాటు



**పాలకుర్తి, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
:పాలకుర్తి మండలం ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. బసంతనగర్ విమానాశ్రయంలో జరిగిన సమావేశం అనంతరం మండల అధ్యక్షునిగా బొల్లి సాయిరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సాయిరాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్ష పదవికి ఏకగ్రీవంగా ఎన్నుకున్న అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం తీర్మానాలకు కట్టుబడి నడుచుకోవాలని సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పికిలింకి శ్రీనివాస్, కోశాధికారి గుండ మధు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లెర్ల ఉదయ్, జిల్లా అధ్యక్షుడు పోగుల విజయ్ కుమార్, సీనియర్ ఫోటోగ్రాఫర్లు తాజొద్దీన్, మాజీ అధ్యక్షులు వైద్య నరేష్, మాదాసు భూమయ్య, సంగెం ప్రకాష్, లక్ష్మణ్, ఒడ్నాల కిషన్, శివతో పాటు పలువురు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి పర్వదినాన నాగలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు






**పెద్దపల్లి, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఎలిగేడు మండలం, రాములపల్లి (ర్యాకల్ దేవ్ పల్లి) గ్రామంలోని నాగలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు కుటుంబసమేతంగా ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చి శివుని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వార్డ్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు. అదే ఆలయంలో ఏసీపీ గజ్జి కృష్ణ దంపతులు కూడా కుటుంబసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాతో సన్మానించగా, ఆలయ పూజారులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయం శివనామ స్మరణతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వార్డ్ సభ్యులు, పలు గ్రామాల ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమం రద్దు

### కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మున్సిపల్ ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలతో సంబంధించి అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీజేపీకి మెజారిటీ లేదు

### - మంత్రి పొన్నం ప్రభాకర్



**వేములవాడ, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి మెజారిటీ లేకపోయినట్లే, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కూడా బీజేపీకి మెజారిటీ లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. నిజామాబాద్‌లో 60 సీట్లలో బీజేపీ 28 సీట్లు గెలిచిందని, అక్కడ పార్లమెంట్ సభ్యుడు మెజారిటీ లేక ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్‌లో మొత్తం 69 సభ్యుల్లో బీజేపీకి 30 సీట్లు మాత్రమే ఉన్నాయని, మేయర్ పదవి కోసం బండి సంజయ్ చేసిన ప్రకటన ప్రజాస్వామ్య పద్ధతికి విరుద్ధమని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, గతంలో కాంగ్రెస్ 13 సీట్లు గెలిచినా మేయర్ పదవి సాధించింది. ఇప్పుడు కూడా స్థానిక ప్రజాప్రతినిధులు, గెలిచిన కార్పొరేటర్లు ప్రజాస్వామ్య పద్ధతిలో మేయర్‌ను ఎన్నుకుంటారు. ముఖ్యమంత్రి, మంత్రుల జోక్యం ఉండదు. ప్రజాస్వామ్యంలో మేము ఎవరికి వ్యతిరేకం కాదు. బీజేపీ గెలిచిన 30 మందికి, మిగిలిన 36 మందికి శుభాకాంక్షలు, అని అన్నారు. అభివృద్ధి దిశగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఉత్తర తెలంగాణలో అత్యధిక డివిజన్లున్న పట్టణంగా తీర్చిదిద్దాలని, కొత్త పాలకవర్గానికి జిల్లా మంత్రిగా సహకరిస్తామని తెలిపారు. మీకు మెజారిటీ ఉంటే మేము అడ్డుపడము. మేయర్ పదవి కోసం ఎవరికీ వ్యతిరేకం కాదు. ప్రజాస్వామ్య పద్ధతిలో గెలిచిన వారే మేయర్ అవుతారు, అని స్పష్టం చేశారు.

# ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు





**హుస్నాబాద్/కరీంనగర్, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలు హుస్నాబాద్, కరీంనగర్ ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. హుస్నాబాద్ అక్కన్నపేట మండలంలోని పంతులు తండా గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచ్ చిన్న నాయక్ (రాజు నాయక్) ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా భోగ్ బండారు కార్యక్రమం జరిగింది. గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవాలాల్ మహారాజ్ బోధనలు, ఆదర్శాలను స్మరించుకున్నారు. ఆయన జీవితం త్యాగం, సేవ, సమానత్వానికి ప్రతీకగా నిలిచిందని వక్తలు కొనియాడారు. అనంతరం ప్రసాద వితరణ చేపట్టి గ్రామస్తులు ఐక్యతతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కరీంనగర్‌లో శాతవాహన యూనివర్సిటీ జేఏసీ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు నిర్వహించారు. విద్యార్థి నాయకుడు నేనావత్ విఠల్ మాట్లాడుతూ గిరిజనులు సేవాలాల్ స్ఫూర్తితో విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించాలని, ప్రభుత్వం గిరిజన అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. సుజాక్ నాయకుడు కరికే మహేష్ మాట్లాడుతూ గిరిజనులపై వివక్షత, దాడులు పెరుగుతున్నాయని, విశ్వవిద్యాలయాల్లో గిరిజనుల సంఖ్య తగ్గిపోతుందని, వీటిని నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, నాయకులు, విద్యార్థులు, మహిళలు, యువకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని సేవాలాల్ మహారాజ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సంకల్పం వ్యక్తం చేశారు.

# పండుగలు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక

### ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**గంగాధర, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం కొండన్నపల్లి సహస్రలింగేశ్వర ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. ఆలయ పురోహితులు, నిర్వాహకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, "సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా పండుగలు నిలుస్తాయి. మహాశివుని ఆశీర్వాదంతో చొప్పదండి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాను. ప్రజలు మహాశివరాత్రి పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నాను, అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, మాజీ సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తీర్మల్ రావు, సర్పంచులు రెండ్ల శ్రీనివాస్, కాదరి హారిక కనుకయ్య, వేముల భాస్కర్, పడాల భాగ్యలక్ష్మి రాజన్న, రామిడి రాజిరెడ్డి, సాగి అజయ్ రావు, తూం రాజు, వేముల అంజి, చందు, మేర్గ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సీఎం కప్ బేస్‌బాల్ పోటీలకు గాయత్రి విద్యానికేతన్ విద్యార్థుల ఎంపిక




**పెద్దపల్లి, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సుల్తానాబాద్‌లో ఆదివారం జరిగిన సీఎం కప్ 2025 జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీల్లో గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు జె. సాత్విక, ఏ. లాస్య ప్రియ, జి. వెన్నెల ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 16 నుండి 20 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పెద్దపల్లి జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ బాధ్యులు పి. వెంకట ఉమాపతి, పెద్దపల్లి టాగ్ ఆఫ్ వార్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఆలేటి సంపత్, జిల్లా సాఫ్ట్బాల్ అసోసియేషన్ సెక్రటరీ వాసు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థుల ఎంపికపై గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ అభినందనలు తెలుపుతూ రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. పాఠశాల కరస్పాండెంట్ రజనీ దేవి, ప్రిన్సిపాల్ విజయ్, వ్యాయామ ఉపాధ్యాయుడు అజయ్ కుమార్ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## లింగమయ్య స్వామి ఆలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రత్యేక పూజలు



**అమ్రాబాద్, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ లింగమయ్య స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ కనిపించింది. ఈ సందర్భంగా అచ్చంపేట ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు డాక్టర్ వంశీకృష్ణ దంపతులు ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ, మహాశివరాత్రి సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పరమశివుని కరుణా కటాక్షాలతో అచ్చంపేట నియోజకవర్గం మరియు తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నాను, అని తెలిపారు. ఆయనతో పాటు సీబమ్ ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ అనురాధ కూడా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మన్ననూర్ సర్పంచ్, అచ్చంపేట మున్సిపాలిటీ చైర్మన్ గార్ల శ్రీనివాసులు, మాజీ ఎంపిటిసి దాసరి శ్రీనివాసులు, మాజీ మండల ఉపాధ్యక్షులు శంభూ శోభ, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## నేడు మున్సిపల్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

**ఆమనగల్లు, ఫిబ్రవరి 15(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగల్లు మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ల ప్రమాణ స్వీకర కార్యక్రమం నేడు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకానుండగా, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పట్టణాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని నూతన ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. శాంతి భద్రతల దృష్ట్యా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.



# ఏఐఎఫ్‌బి కార్పొరేటర్లకు విప్

## బీజేపీపై తీవ్ర విమర్శలు



**కరీంనగర్, ఫిబ్రవరి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ కార్పొరేటర్ విపుల సాయి జ్యోతి, 27వ డివిజన్ కార్పొరేటర్ బొట్ల శ్యామలకు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ విప్ జారీ చేసినట్లు రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి తెలిపారు. ఆదివారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏఐఎఫ్‌బి పార్టీ బి ఫామ్‌పై గెలిచిన కార్పొరేటర్లలో ఒకరిని బీజేపీలో చేర్చుకోవడం సిగ్గుచేటు అని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిని బీజేపీలో చేర్చుకోవడం ద్వారా కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రజాస్వామ్యాన్ని అవమానపరుస్తున్నారని, మేయర్ స్థానం కోసం బీజేపీ నీచమైన రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. బీజేపీకి మేయర్ ఎన్నుకోవడానికి పూర్తిస్థాయి మెజారిటీ లేకపోవడంతో ఇతర పార్టీల నుంచి గెలిచిన వారిని కిడ్నాప్ చేసి తమ పార్టీలో చేర్చుకోవడం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఇప్పటివరకు ఏఐఎఫ్‌బి పార్టీ కార్పొరేషన్‌లో ఎవరికి మద్దతు ఇవ్వాలో అధికారికంగా ప్రకటించలేదని, పార్టీ బి ఫామ్‌పై గెలిచి ఇతర పార్టీలకు వెళితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం ఉదయం 10 గంటల వరకు పార్టీ కేంద్ర, రాష్ట్ర కమిటీలు ఎవరికి మద్దతు ఇవ్వాలో స్పష్టత ఇస్తాయని, బీజేపీకి మద్దతు ఇచ్చే పరిస్థితి లేదని జోజి రెడ్డి స్పష్టం చేశారు. మత రాజకీయాలను రెచ్చగొట్టే విధంగా బీజేపీ వ్యవహరిస్తోందని తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి తేజ్ దీప్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బండారి శేఖర్, నగర అధ్యక్షుడు సత్యరావు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో 163 బీఎన్ఎస్ అమలు



**కరీంనగర్, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
:రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రేపు జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపాలిటీల ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పరోక్ష ఎన్నికల దృష్ట్యా కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో 163 బ్యాట్స్ ఉత్తర్వులు అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల పరిధిలో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడటంపై నిషేధం విధించారు. ఈ ఉత్తర్వులు ఫిబ్రవరి 16 ఉదయం 6 గంటల నుండి ఫిబ్రవరి 17 ఉదయం 6 గంటల వరకు అమల్లో ఉంటాయి. చట్టబద్ధమైన సమావేశాలకు సంబంధిత అధికారుల ముందస్తు అనుమతి తప్పనిసరి అని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులు, సైనిక సిబ్బంది, హోంగార్డులు, అంత్యక్రియల ఊరేగింపులు, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, వైద్య మరియు అత్యవసర సేవలు, ప్రత్యేక అనుమతి పొందిన వ్యక్తులు ఈ ఉత్తర్వుల నుండి మినహాయింపు పొందుతారని తెలిపారు. మున్సిపల్ పరోక్ష ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు పోలీసు యంత్రాంగానికి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# దైవచింతతో మానసిక ప్రశాంతత

## - సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**ఆమనగల్లు, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దైవచింతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామంలోని శ్రీ త్రిపురాంతకేశ్వర అయ్యసాగర క్షేత్రాన్ని సందర్శించి, శ్రీ వీరభద్ర స్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం శివాలయంలో రుద్రాభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరూ పరమశివుని ఆశీస్సులతో పాడిపంటలతో సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వికాస సంఘ అధ్యక్షుడు నర్సిరెడ్డి, కార్యదర్శి పంచాక్షరి, ఆలయ సూపర్‌వైజర్ వైద్యనాథ్, మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు, తౌర్య నాయక్, రామకృష్ణ, రవి, పంతు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# యాదిలాల్ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం



**ఆమనగల్లు, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కోనాపూర్ గ్రామంలోని ఊరగుట్ట శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కమిటీ సభ్యులు, ప్రముఖ న్యాయవాది, ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ దంపతులు స్వయంగా శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించి, అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదించారు.

# మహాశివరాత్రి సందర్భంగా నాగలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



**ఎలిగేడు, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎలిగేడు మండలం రాములపల్లి గ్రామంలోని శ్రీ నాగలింగేశ్వర స్వామి ఆలయంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు కుటుంబసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగలింగేశ్వరుని కరుణ కృప ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, అందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంపై సదస్సు

## - విజయవంతం చేయాలని పిలుపు



**షాద్‌నగర్, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం నిర్లక్ష్యంపై ఈ నెల 18న షాద్‌నగర్ పట్టణంలోని పెన్షనర్ భవన్‌లో సదస్సు జరగనుంది. సాయంత్రం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ప్రొఫెసర్ హరగోపాల్, తెలంగాణ జన సమితి నేత ప్రొఫెసర్ కోదండరాం, ఆర్థిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ డి. నరసింహారెడ్డి, ప్రొఫెసర్ జిలుకర శ్రీనివాస్, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి హాజరుకానున్నారు. రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు గడిచినా రిజర్వాయర్ నిర్మాణం చేపట్టకపోవడం వల్ల ఈ ప్రాంత రైతులు, గిరిజనులు నీటి కరువుతో వలసలు వెళ్తున్నారని ప్రజాసంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతులను మోసం చేస్తున్నాయని వారు ఆరోపించారు. ఈ సదస్సుకు రైతులు, ప్రజాసంఘాలు, వామపక్ష--ప్రతిపక్ష నేతలు, మేధావులు, విద్యార్థి సంఘాలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీజీ శ్రీనివాస్, అర్జునప్ప, రవీంద్రనాథ్, తిరుమలయ్య, శ్రీకాంత్, ఈశ్వర్, రామ్‌చందర్, సత్యనారాయణ, ప్రితమ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలలో పాల్గొన్న గోలి శ్రీనివాస్ రెడ్డి



**వెల్దండ, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగాయి. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, సేవాలాల్ మహారాజ్ చేసిన సేవలు ప్రజలకు మార్గదర్శకాలు కావాలని, సమానత్వం విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి మహారాజ్ సేవలను కొనియాడారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. భజనలు, కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆధ్యాత్మిక భావంలో ముంచెత్తాయి. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గిరిజన నాయకులు, యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని జయంతి ఉత్సవాలను విజయవంతం చేశారు. వెల్దండ మండలంలో ఈ వేడుకలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# మైసిగండి శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు



**కడ్తాల్, ఫిబ్రవరి 15 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
: రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మైసిగండి శివ రామాలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమాయ్యాయి. శివునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

# చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం



**కరీంనగర్, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చిన్మయ మిషన్ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో పవిత్రమైన రుద్ర హోమం, రుద్రాభిషేకం, రాత్రి శివకళ్యాణం, లింగోద్భవ హారతి ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో 108 హిందూ దంపతులు భక్తిశ్రద్ధలతో పాల్గొని కార్యక్రమాన్ని ఆధ్యాత్మికంగా విజయవంతం చేశారు. ఈ కార్యక్రమాన్ని బ్రహ్మశ్రీ అక్షయ చైతన్య శాస్త్రోక్త విధానాలతో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, చిన్మయ మిషన్ స్థాపనకు 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా అమృత ఉత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్క హిందువు కనీసం ఐదు భగవద్గీత శ్లోకాలు చదవాలనే ఉద్దేశంతో గీతా పంచామృతం అనే పుస్తకాన్ని ఉచితంగా అందజేస్తున్నామని, ఈరోజు పాల్గొన్న భక్తులందరికీ కూడా అందజేశామని చెప్పారు. అమృత రథయాత్ర ఒక సంవత్సరం పాటు దేశమంతా పర్యటించి, వచ్చే మే 29న కరీంనగర్‌కు రానుందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చిన్మయ మిషన్ ప్రధాన కార్యదర్శి గజవాడ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నలుమాసు సుదర్శన్, సంయుక్త కార్యదర్శి రాచకొండ రజనీకాంత్, కార్యవర్గ సభ్యులు గరిపెల్లి చంద్రం, కోశాధికారి అంచురి అరుణ, గజవాడ శ్రీదేవి, మహిపాల్, వైకుంఠం, అరబిందమ్మ, తోడుపునూరి తిరుపతి, మంజుల, మునీందర్, మహేష్, గౌరవాధ్యక్షులు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన ఫార్వర్డ్ బ్లాక్ ఇండిపెండెంట్ కార్పొరేటర్లు



**కరీంనగర్, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు పెరుగుతోంది. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు, ముగ్గురు ఇండిపెండెంట్ కార్పొరేటర్లు ఆదివారం హైదరాబాదులో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సమక్షంలో, కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన విప్పుల సాయి జ్యోతి, బొట్ల శ్యామలతో పాటు ఇండిపెండెంట్ కార్పొరేటర్లు సౌగాని కొమరయ్య, ఆకుల నందిని ఉదయ్, పర్వతం మల్లేశం కాంగ్రెస్ గూటికి చేరారు. వీరందరిని మంత్రులు సాదరంగా ఆహ్వానించారు. అదేవిధంగా ఎంఐఎం పార్టీకి చెందిన ముగ్గురు కార్పొరేటర్లు, స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన మజీదు హుస్సేన్ కూడా కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమం ఎంఐఎం జిల్లా నేత గులాం అహ్మద్ ఆధ్వర్యంలో జరిగింది. కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్పొరేటర్లు మాట్లాడుతూ, కరీంనగర్ అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన పేదలందరికీ చేరేలా కృషి చేస్తామని తెలిపారు. అభివృద్ధి కాంక్షించి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వారు స్పష్టం చేశారు.

## ఘనంగా గిరిజనుల ఆరాధ్య దైవం "శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్" 287 వ జయంతి వేడుకలు





**కడ్తాల్, ఫిబ్రవరి 15 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** : కడ్తాల్ మండల కేంద్రంలో గిరిజన భవన్ లో సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి,గానుగుమర్ల తండా గ్రామ ఉప సర్పంచ్ జర్పుల లక్పతి నాయక్ ,సేవాలాల్ సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నరేష్ నాయక్ ఆధ్వర్యంలో గిరిజనుల ఆరాధ్య దైవం "శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్" 287 వ జయంతి సందర్భంగా భోగ్ బండారు కార్యక్రమం మరియు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి ,మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కడ్తాల్ లో సేవాలాల్ గుడి కట్టడానికి కోటి రూపాయలు మరియు నూతన గిరిజన కమిటీ హాల్ కట్టడానికి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గిరిజన సేవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు హనుమ నాయక్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ జడ్పిటిసి దశరథ్ నాయక్,టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్,కడ్తాల్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీచ్య నాయక్,కడ్తాల్ మండల్ 24 గ్రామ పంచాయితీ సర్పంచ్ లు,డుప్యూటీ సర్పంచ్ లు,మాజీ ప్రజాప్రతినిధులు,గిరిజన నాయకులు, మహిళలు, యువత, యువతి, విద్యార్థులు,యుదోగ సంఘాలు,అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శివాలయాల్లో మహా శివరాత్రి వేడుకలు







**ఇబ్రహింపట్నం , ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** : ఇబ్రహింపట్నం నియోజకవర్గం పరిధిలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు – శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు .ప్రత్యేక పూజలు చేస్తూ పరమేశ్వరుడిని ఆరాధిస్తున్న భక్తులు. యాచారం మండలంలోని శివాలయాల్లో ఆదివారం మహాశివరాత్రి వేడుకలు ప్రజలు పూజ కార్యక్రమలో పాల్గొని ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని నక్కర్త మేడిపల్లి , నందివనపర్తి, గున్ గల్, తక్కలపల్లి , కొత్తపల్లి, తదితర గ్రామంలోని దేవాలయాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. నక్కర్త మేడిపల్లి సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ మాట్లాడుతూ...మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మహాశివుడిని ప్రార్థిస్తున్నానన్న సర్పంచ్, ఉపవాస పూజలు చేస్తున్న భక్తులకు శివయ్య ఆశీర్వాదం ఉండాలని ఆకాంక్షించారు. నక్కర్త మేడిపల్లి గ్రామంలో వీరన్న గుట్టపై ఉన్న పురాతన శివాలయం దగ్గర స్వామినీ దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కుటుంబ సమేతంగా గరళాకంఠుడిని దర్శించుకున్నారు.

## గిరిజనుల జీవితాలలో వెలుగులు నింపిన మహనీయుడు సేవలాల్ మహారాజ్

### కడ్తాల్ మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్



**కడ్తాల్, ఫిబ్రవరి 15 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :** కడ్తాల్ మండల కేంద్రంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు గిరిజన సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కడ్తాల్ మాజీ జెడ్పిటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ గొప్ప ఆధ్యాత్మిక వేత్త అన్ని గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు సేవాలాల్ మహారాజ్ అని కొనియాడారు.ఆయన ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలన్నారు.బిఆర్ఎస్ హయాంలో గిరిజన సేవాలాల్ మహారాజ్ భవనం రాష్ట్ర రాజధానిలో నిర్మించడం జరిగింది సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా జరుపుకోవడానికి అవకాశం కల్పించింది అదేవిధంగా తండాలను గ్రామపంచాయతీలు చేయడంతో పాటు గిరిజనుకు 10/ శాతం రిజర్వేషన్ తో పాటు అభ్యున్నతికి ఎంతో కృషి చేయడం జరిగిందని గుర్తు చేశారు.అదేవిధంగా గిరిజనుల సంక్షేమానికి బిఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని తెలిపారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ దేశం గర్వించదగ్గ ఆధ్యాత్మిక వేత్త అని ఆయన సూచించిన మార్గంలో అందరూ ముందుకు సాగాలని సూచించారు. గిరిజనులలో అభ్యున్నతికి సేవాలాల్ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గిరిజన రాష్ట్ర నాయకులు గిరిజన సంఘాలు నాయకులు, యువకులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ మహరాజ్ బోధనలు స్ఫూర్తిదాయకం


### సర్పంచ్ గోపాల్...



**కడ్తాల్, ఫిబ్రవరి 15 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ బోధనలు స్ఫూర్తిదాయకమని సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు,రావిచేడ్ సర్పంచ్ బొప్పిడి గోపాల్ పేర్కొన్నారు. ఆదివారం కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామంలోని మద్దెలకుంట తండాలో సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో సర్పంచ్ బొప్పిడి గోపాల్ పాల్గొని సేవాలాల్, మేరమ్మా అమ్మవారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు సంత్ సేవాలాల్ అని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని గోపాల్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రవికుమార్, హనుమాన్ నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీ కస్నానాయక్, మాజీ ఎంపీటీసీ వసంత, బీఆర్ఎస్ నాయకులు బాలకృష్ణ, రమేష్, సాయికుమార్, తండావాసులు తదితరులున్నారు.

## శ్రీ రామేశ్వర వీరాంజనేయ స్వామి జ్ఞాన సరస్వతి క్షేత్రంలో ఎన్ ఎస్ ఎస్ సేవలు

### ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో సర్వాంగ సుందరంగా ముస్తాబైన దేవాలయం



**కడ్తాల్, ఫిబ్రవరి 15 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :** మండల కేంద్రంలోని అన్మాస్ పల్లి లో గల శ్రీ రామేశ్వర వీరాంజనేయ స్వామి జ్ఞాన సరస్వతి క్షేత్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫలక్ నుమా హైదరాబాద్ కు చెందిన విద్యార్థులు ఎన్ఎస్ఎస్ క్యాంప్ లో భాగంగా ఆదివారం 6వ రోజు మహాశివరాత్రి పర్వదినాన భక్తులకు అనుగుణంగా ఆలయ ప్రాంగణంలో శ్రమదానం, పరిసరాల పరిశుభ్రత, దేవాలయం లో శుభ్రం చేసి ఆలయాన్ని ముస్తాబు చేసి ఏర్పాట్లు ఘనంగాచేశారు .దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు. అన్మాస్ పల్లి గ్రామ ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు భారీగా హాజరుకానున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ యూనిటీ 1,2,3 ప్రోగ్రాం ఆఫీసర్స్ డా. బాబు రావు, డా. శశికళ, డా. సరిత రాణి మరియు ఆలయ కమిటీ సభ్యులు రాజు గౌడ్, శ్రీరాములు,శంకర్, భరత్, ప్రశాంత్, విద్యార్థులు,గ్రామస్తులు, భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

## ఎక్స్ అఫీషియో ఓట్లతో మారనున్న ఆమనగల్లు రాజకీయ సమీకరణాలు

**ఆమనగల్లు, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరనున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బిఆర్ఎస్ 8, బీజేపీ 6, కాంగ్రెస్ 1 స్థానాలు గెలుచుకున్నాయి. చైర్మన్ పదవికి కావలసిన మెజారిటీ బిఆర్ఎస్ సాధించినప్పటికీ, బీజేపీ--కాంగ్రెస్ జట్టు కట్టి అధికారాన్ని చేజిక్కించుకునేందుకు వ్యూహం రచించినట్లు సమాచారం.ఎక్స్ అఫీషియో ఓట్లతో కూటమి బలం 9కి పెరిగి, కాంగ్రెస్‌కు చైర్మన్, బీజేపీకి వైస్ చైర్మన్, నామినేటెడ్ పదవులు దక్కనున్నట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. దీంతో బిఆర్ఎస్ పార్టీ గెలిచి ఓడినట్లే పరిస్థితి ఏర్పడిందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల ఎంపికపై ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## రవీంద్రభారతిలో దేవులపల్లి రమేశ్‌కు ఘన సన్మానం



**సిద్దిపేట, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హైదరాబాద్ రవీంద్రభారతిలో విమల సాహితీ సమితి, తెలంగాణ సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన "యుద్ధం--శాంతి" పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో నంగునూర్ మండలానికి చెందిన రచయిత, కవి దేవులపల్లి రమేశ్ ఘనంగా సన్మానించబడ్డారు.దేశమా నీకు ఇదే వందనం అనే కవితను గానం చేసి సాహిత్య సేవలు అందించినందుకు ఆయనకు పద్మశ్రీ కులకలూరి ఇనాక్, డాక్టర్ గోరేటి వెంకన్న, డా. బిక్కి కృష్ణ, డా. రాధా కుసుమ చేతుల మీదుగా సన్మానం జరిగింది.ఈ సందర్భంగా కవి రమేశ్ మాట్లాడుతూ తెలుగు సాహిత్య చరిత్ర, తెలుగు భాష గొప్పతనాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డా. నాళేశ్వర శంకరం, శిఖామణి, కవులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు



**వెల్దండ, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. గిరిజన సంఘం అధ్యక్షుడు అజిత్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గిరిజన ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.సర్పంచ్ మట్ట యాదమ్మ, వెంకటయ్య గౌడ్, ఉపసర్పంచ్ బసన్మోని శ్రీను ముదిరాజ్‌తో పాటు అన్ని పార్టీల నాయకులు హాజరై పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడు కొయ్యల పుల్లయ్య, గంగాపురం నరసింహ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం.డి. రషీద్, ఈదులపల్లి శ్రీను, గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న 8వ వార్డు కౌన్సిలర్ కోడెల లలిత



**కల్వకుర్తి, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మున్సిపాలిటీ 8వ వార్డులో స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన కోడెల లలిత, గణేష్ యాదవ్‌లు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారిని కండువా కప్పి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి బృంగి రత్నమాల, ఆనంద్ కుమార్, వెల్దండ మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ యాదవ్, వెల్దండ సర్పంచ్ మట్ట వెంకటయ్య గౌడ్, కాంగ్రెస్ నాయకులు అలీ తదితరులు పాల్గొన్నారు.

# మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

## పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



**కడ్తాల్, ఫిబ్రవరి 15 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కడ్తాల్ మండల పరిధిలోని ఎక్వాయిపల్లి - ముద్విన్ గ్రామాల సమీపంలో మల్లన్న గుట్టపై వెలసిన మల్లికా ర్జునస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు వైభావంగా ప్రారంభ మాయ్యాయి. తొలిరోజు మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహారెడ్డి, జోగు విరయ్య, మార్కెట్ మాజీ డైరక్టర్ వెంకటేష్ పూజలు చేశారు. మరో నాలుగు రోజుల పాటు మల్లన్న నామస్మరణ మార్మోగనుంది. ఉత్సవాలకు ఆలయ నిర్వాహకులు ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. ఆహ్లాదభరితమైన వాతావ రణలో ఏటా మహాశివరాత్రికి ఉత్సవాలు నిర్వహించడం సంప్రదాయం. కడ్తాల్ మండల ప్రజలతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు వసతులు కల్పించినట్లు ఆలయ ప్రధాన ధర్మకర్త ఎట్టయ్య యాదవ్ పేర్కొన్నారు. మహా శివరాత్రి సందర్భంగా గణపతి పూజ అనంతరం, పంచామృతంతో అభిషేకం,అర్ధరాత్రి శివ పార్వతుల కల్యాణోత్సవం, ఒగ్గుకథ నిర్వహించారు. నేడు తెల్లవారుజామున అగ్నిగుండాల మహో త్సవం, 17న ప్రత్యేక పూజలు, రాత్రికి రథోత్స వం. 18న ప్రత్యేక అర్చనలు, విశేషపూజలు, దోపోత్సవం, ఆదివారం చక్రతీర్థం, ఒగ్గుకథతో మల్లన్న ఉత్సవాలు ముగిస్తాయని తెలిపారు.

# ఎలిగేడు మండలంలో అంగరంగ వైభవంగా శివకళ్యాణం


అంగరంగ వైభవంగా రాములపల్లి నాగలింగేశ్వర దేవాలయంలో శివ కళ్యాణం


ఎలిగేడు మండల కేంద్రంలోని భవాని రామలింగేశ్వర ఆలయంలో శివ కళ్యాణం పాల్గొన్న సర్పంచ్ కప్పల ప్రవీణ్


ఎలిగేడు భవాని రామలింగేశ్వర ఆలయంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకం కార్యక్రమంలో


దూళికట్ట శివాలయంలో భక్తుల దర్శనం

**ఎలిగేడు, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎలిగేడు మండల కేంద్రంలోని భవాని రామలింగేశ్వర ఆలయం, రాములపల్లి నాగలింగేశ్వర ఆలయాల్లో ఆదివారం శివకళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్, రాములపల్లి సర్పంచ్ సిద్ధి తిరుపతి, భవాని రామలింగేశ్వర ఆలయ ప్రధానార్చకులు సేగ్గామా దయాకర్ శర్మ, ఉమేశ్ శర్మ, బ్రహ్మశ్రీ పారువెల్ల నాగరాజు శర్మ, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు




**వర్ధన్నపేట,ఫిబ్రవరి 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
: బంజారా సమాజ చరిత్రలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ పేరు అక్షరాలా ఆరాధ్యంగా నిలిచింది. ఆధ్యాత్మిక మార్గదర్శిగా, ధర్మబోధకుడిగా, సమాజ సంస్కర్తగా ఆయన చూపిన దారి నేటికీ బంజారా సమాజానికి దిక్సూచి. సేవ, సత్యం, సమానత్వం, సామాజిక న్యాయం అనే విలువలను బోధిస్తూ సమాజాన్ని ఐక్యత వైపు నడిపించిన మహనీయుడు సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు వర్ధన్నపేట మండలం చంద్రు తండా గ్రామంలో ఘనంగా నిర్వహించారు. చంద్రుతండా గ్రామ సర్పంచ్ భూక్య నీలా రవి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోరు సిక్వాడి వచ్చారి దళ్ రాష్ట్ర ప్రముఖ్ కేపీ నాయక్ హాజరయ్యారు. ముందుగా సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం చంద్రు తండ గ్రామపంచాయతీ ప్రాంగణం వద్ద మహా భోగ్ బండర్ కార్యక్రమం నిర్వహించి, సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్బంగా కేపీ నాయక్ మాట్లాడుతూ బంజారాలలో జ్ఞానజ్యోతిని వెలిగించిన గొప్ప ఆధ్యాత్మిక గురువు, ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ అని అన్నారు. ప్రజల మేలు కోసం అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. బంజారాల సంస్కృతికి ఆధ్యాత్మికతను జోడిస్తూ, దేశమంతా సంచరిస్తూ, హితబోధ చేశారన్నారు. దేశమంతా ఛిన్నాభిన్నంగా ఉన్న బంజారా సమాజాన్ని సేవాలాల్ ఏకం చేశారన్నారు. బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాదులు వేసిన మహానీయుడని కొనియాడారు. సేవాలాల్ మహారాజ్ జీవితం ఒక ఆధ్యాత్మిక ప్రయాణం మాత్రమే కాదు, ఒక సామాజిక ఉద్యమం కూడా. బంజారా సమాజంలో వ్యాప్తి చెందిన అజ్ఞానం, మూఢనమ్మకాలు, విభేదాలను తొలగించి సమగ్రతను నెలకొల్పేందుకు ఆయన కృషి చేశారని అన్నారు. సమాజంలో ప్రతి వ్యక్తి సమానమని, కుల, వర్గ భేదాలు లేకుండా అందరూ ఐక్యంగా జీవించాలనే సందేశాన్ని ఇచ్చారన్నారు. ఆయన బోధనలు సత్యం, ధర్మం, సేవ భావాలపై నిలిచాయి. సేవ చేయడం ద్వారానే జీవితం సార్థకం అవుతుందని ఆయన చెప్పేవారు. సమాజానికి మేలు చేసే పనులే నిజమైన ఆరాధన అని ఉపదేశించారు. బంజారా యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, ఐక్యతతో ముందుకు సాగాలని ప్రేరేపించారు. ఆయన చూపిన మార్గం సమాజానికి నైతిక బలం ఇచ్చింది. సేవాలాల్ మహారాజ్ కేవలం ఆధ్యాత్మిక నాయకుడే కాదు. సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్న సంస్కర్త. మహిళలకు గౌరవం, సమాజంలో పరస్పర సహకారం, ధర్మబద్ధమైన జీవనం వంటి అంశాలను ప్రోత్సహించారు. సమాజంలో సమానత్వాన్ని నెలకొల్పడంలో ఆయన ఆలోచనలు కీలక పాత్ర పోషించాయి. సేవాలాల్ మహారాజ్ జీవితం నేటి తరాలకు ఒక స్ఫూర్తి. విభేదాల కంటే ఐక్యత గొప్పదని, అహంకారం కంటే వినయం మేలని, స్వార్థం కంటే సేవ శ్రేష్ఠమని ఆయన చూపించారు. సమాజం బలపడాలంటే పరస్పర గౌరవం అవసరమని ఆయన బోధించారు. మొత్తంగా సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి కేవలం ఒక ఆచరణాత్మక వేడుక కాదు. అది విలువలను గుర్తు చేసే రోజు. సేవ, సత్యం, సమానత్వం, సామాజిక న్యాయం అనే సిద్ధాంతాలను ఆచరణలో పెట్టే సంకల్ప దినం. బంజారా సమాజాన్ని ఐక్యత వైపు నడిపించిన మహనీయుడిగా సేవాలాల్ మహారాజ్ పేరు చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. దేశంలో ఉన్న కోట్లాదిమంది గిరిజనులకు సేవాలాల్ మార్గదర్శి, ఆదర్శప్రాయుడని, ఆయన చూపిన బాటలో అందరూ నడవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రుతండా గ్రామ సర్పంచ్ భూక్యా నీలా - రవినాయక్, ఉపసర్పంచ్ భూక్యా బుజ్జి - భద్రునాయక్, వార్డుమెంబర్లు, దేశ్య , వెంకన్న,వెంకటేష్, రాజు, నెహ్రూ, స్వామి, రాజేందర్ రాథోడ్, తండా నాయకులు,రామచంద్రు, వెంకన్న, శ్రీరాములు,రవి, రాజు, బోజ్యా, గోర్సేన నాయకులు, చిట్టిబాబు, కృష్ణ, మధు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు...

# గుండాల శ్రీ అంబ రామలింగేశ్వర ఆలయంలో మహాశివరాత్రి వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి





**వెల్దండ, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండలంలోని గుండాల గ్రామంలో దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ అంబ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామి వారికి అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ సందీప్ రెడ్డి, వైస్ చైర్మన్ అరుణ నాయక్, గుండాల సర్పంచ్ జక్కుల శిరీష వెంకటయ్య, వెల్దండ సర్పంచ్ మట్ట యాదమ్మ, మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి, ఉపసర్పంచ్ శీను, పర్వత్ రెడ్డి, కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ కుమార్ యాదవ్, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడు కొయ్యల పుల్లయ్య, వార్డు సభ్యులు ముదిగొండ రమేష్, పురుషోత్తం, కమిటీ సభ్యులు అంజయ్య, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మైసిగండి శివాలయంలో అభిషేకం



**కడ్తాల్, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కడ్తాల్ మండలంలోని మైసిగండి శివాలయం లో అభిషేకం ప్రత్యేక పూజల్లో పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్ పద్మశ్రీ, సర్పంచ్ ప్రేమ జవహర్ లాల్ నాయక్, ఉప సర్పంచ్ హీరా సింగ్ నాయక్,మాజీ సర్పంచ్ తులసిరాం నాయక్, సురేష్ గౌడ్ రేణుక ఉమా దేవి,తులసి రాం, సాయి కుమార్, పాండు నాయక్, అను, సాయి, ఫలానీష్, సుగంద్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

# ఊరేగింపుగా బయలుదేరిన శ్రీ అంబ రామలింగేశ్వర స్వామి









**వెల్దండ, ఫిబ్రవరి 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలో బ్రహ్మంగారి మూడు రోజుల నాటక ప్రదర్శన అనంతరం శ్రీ అంబ రామలింగేశ్వర స్వామి ఆదివారం రాత్రి ఊరేగింపుగా బయలుదేరి గుండాలకు చేరుకున్నారు. తెల్లవారుజామున 3:45 గంటలకు కళ్యాణ మహోత్సవం జరగనున్నట్లు దేవాలయ పూజారి నరహరి తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్దండ సర్పంచ్ మట్ట యాదమ్మ, వెంకటయ్య గౌడ్, మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి, ఉపసర్పంచ్ శ్రీను, వార్డు సభ్యులు ముదిగొండ రమేష్, మసిగుండ్ల వెంకటేష్, జంగిలి సునీత ఆనంద్, పాలాది మల్లేశ్వరి, రంగనాథం, యెన్నం కృష్ణారెడ్డి, అల్వాల్ రెడ్డి, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడు కొయ్యల పుల్లయ్య, శ్రీశైలం గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## పల్సర్ ప్రియులకు గుడ్‌న్యూస్..
# మే నాటికి 8 సరికొత్త బైక్‌లు!

బజాజ్ ఆటో బజాజ్ పల్సర్ చాలా కాలంగా భారతీయ ద్విచక్ర వాహన మార్కెట్లో యువతకు ఇష్టమైనది. 125cc నుండి 400CC విభాగంలో అందుబాటులో ఉన్న ఈ సిరీస్ దాని సరసమైన ధర, స్పోర్టీ లుక్స్, శక్తివంతమైన పనితీరుకు ప్రసిద్ధి చెందింది. ఎక్స్-షోరూమ్ ధరలు సుమారు రూ.81,000 నుండి ప్రారంభమై సుమారు రూ.1.94 లక్షల వరకు ఉంటాయి. ఇప్పుడు పల్సర్ లైనప్‌లో మే 2026 నాటికి సుమారు ఎనిమిది కొత్త లేదా అప్‌డేట్ చేసిన బైక్‌లను ప్రవేశపెడతామని కంపెనీ సూచించింది. పల్సర్ శ్రేణిలో ఎంట్రీ-లెవల్ మోడల్స్ ఉన్నాయి. అలాగే N, NS, RS వంటి వివిధ రకాల ఎంపికలు ఉన్నాయి. ఇవి వివిధ అవసరాలు, బడ్జెట్‌లతో కస్టమర్‌లకు అనుగుణంగా రూపొందించారు. గత సంవత్సరం జీఎస్టీ 2.0 అమలు తర్వాత అనేక మోడళ్ల ధరలు కూడా తగ్గించారు. దీనివల్ల



కస్టమర్లకు నేరుగా ప్రయోజనం చేకూరుతుంది. రాబోయే అప్‌డేట్‌లలో కొన్ని బైక్‌ల కోసం చిన్న డిజైన్ మార్పులు ఉండవచ్చని తెలుస్తోంది. అయితే ఇతర మోడళ్లు శక్తివంతమైన ఫీచర్లు, కొత్త సాంకేతికతను పొందవచ్చు. మారుతున్న ట్రెండ్‌లు, కస్టమర్ అంచనాలకు అనుగుణంగా పల్సర్‌ను మరింత మెరుగుపరచడం కంపెనీ లక్ష్యం.


**పల్సర్ 125, పల్సర్ 150 అప్‌డేట్‌లు**

పల్సర్ 125, పల్సర్ 150 లను ఇటీవలే 2026 మోడళ్ల వలె అప్‌డేట్‌లతో ప్రవేశపెట్టారు. పోటీ తీవ్రంగా ఉన్న 150cc కంటే ఎక్కువ సెగ్మెంట్‌పై కంపెనీ ఇప్పుడు దృష్టి సారించింది. మెరుగైన డిజైన్, అధునాతన ఫీచర్లు, అధునాతన సాంకేతికత ద్వారా మార్కెట్ వాటాను పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

**N సిరీస్ ఇప్పటికే కొత్త ప్లాట్‌ఫామ్‌పై ఆధారపడి ఉంది.**

వివిధ సిరీస్‌ల విషయానికొస్తే చీ సిరీస్ ఇప్పటికే కొత్త ప్లాట్‌ఫామ్‌పై ఆధారపడి ఉంది. అందుకే పెద్ద మార్పులు అసంభవం. మరోవైపు, ఎన్‌ఎస్ సిరీస్‌లో గణనీయమైన అప్‌డేట్‌లు ఉండవచ్చు. పల్సర్ చీా160, పల్సర్ చీా200 కొత్త డిజైన్, డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, అదనపు ఫీచర్లను పొందుతాయని భావిస్తున్నారు. ఫ్లాగ్‌షిప్ పల్సర్ NS400 Z కోసం ఇంజిన్ మార్పులు కూడా చర్చకు వస్తున్నాయి.

## జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్స్ ప్రాఫిట్ డౌన్



**హైదరాబాద్, :**
జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.173.96 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.202.10 కోట్ల లాభంతో పోలిస్తే 14 శాతం తగ్గింది.ఒకేసారి అధికంగా రూ. 183.12 కోట్ల చెల్లింపులు జరపడం వల్లనే లాభాల్లో గండిపడిందని కంపెనీ వర్గాలు వెల్లడించింది. దీంట్లో నూతన కార్మిక చట్టం అమలు చేయడానికి ఒకేసారి రూ.69.65 కోట్ల నిధులు వెచ్చించినట్టు పేర్కొన్నారు. కంపెనీ ఆదాయం మాత్రం భారీగా పెరిగింది. ఏడాది క్రితం రూ.2,748 కోట్లుగా ఉన్న ఆదాయం ఈసారి రూ.4,082 కోట్లకు చేరుకున్నది. నిర్వహణ ఖర్చు లు రూ.2,294 కోట్లకు చేరాయి.

# రూపాయి 93కు పడిపోవచ్చు!

**న్యూఢిల్లీ,**
దేశీయ కరెన్సీకి మరిన్ని చిల్లులు తప్పేటట్టు కనిపించడం లేదు. ప్రస్తుతం సంవత్సరం చివరినాటికి డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 93 స్థాయికి పడిపోవచ్చునని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ అంచనావేస్తున్నది. ఈ ఏడాది అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్ల నిర్ణయం ఆధారంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తరలిపోయే ప్రమాదం ఉన్నదని, దీంతో రూపాయికి బెడద తప్పదని రేటింగ్ ఏజెన్సీ వెల్లడించింది. రష్యాయేతర ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నట్టు భారత్ ప్రకటించడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను తరలించుకుపోవడం కూడా



రూపాయి స్థాయిని మరింత దిగజారుస్తుందని పేర్కొంది. గడిచిన సంవత్సరంలో రూపాయి విలువ 5 శాతం పతనం చెంది 92 స్థాయిలో కదలాడుతున్నది.

# స్పోర్ట్స్

# అమ్మాయిల బోణీ..
# తొలి టీ20లో ఆసీస్‌పై గెలుపు

### మెరిసిన హైదరాబాదీ పేసర్ అరుంధతి


సిడ్నీ
ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) తర్వాత భారత మహిళల జట్టు ఆడిన తొలి మ్యాచ్‌లోనే సత్తాచాటింది. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. కంగారూలతో సిడ్నీలో వర్షం అంతరాయం కల్గించిన తొలి మ్యాచ్‌లో ప్రత్యర్థిని 21 పరుగుల (డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో) తేడాతో ఓడించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సాధించింది. హైదరాబాదీ పేసర్ అరుంధతి రెడ్డి (4/22) కెరీర్ బెస్ట్ ప్రదర్శనకు తోడు రేణుకా సింగ్ ఠాకూర్



(2/14) పవర్ ప్లేలో కట్టుదిట్టమైన బౌలింగ్‌తో మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 18 ఓవర్లలో 133 పరుగులకే కుప్పకూలింది. జార్జియా వర్హెమ్ (19 బంతుల్లో 30, 4 ఫోర్లు) టాప్ స్కోరర్. తెలుగమ్మాయి శ్రీచరణి (2/14) రెండు వికెట్లు తీసింది. స్వల్ప ఛేదనలో బ్యాటింగ్‌కు వచ్చిన భారత్.. 5 ఓవర్లలోనే 50 రన్స్ దంచేసింది. షెఫాలీ వర్మ (11 బంతుల్లో 21, 1 ఫోర్, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడింది. వర్షం వచ్చే సమయానికి లక్ష్యానికంటే 21 రన్స్ ఎక్కువగా ఉండటంతో భారత్ విజేతగా నిలిచింది. ఆస్ట్రేలియాలో ఆస్ట్రేలియాను ఓడించడం (టీ20ల్లో) భారత్‌కు ఆరేండ్ల తర్వాత ఇదే ప్రథమం.

# నమీబియాకు అమెరికా షాక్


**చెన్నై**
రెండో టీ20 ప్రపంచకప్ ఆడుతున్న యూఎస్‌ఏ తమకంటే మెరుగైన జట్లకు షాకులిస్తున్నది. గ్రూప్-ఏలో ఆ జట్టు.. 31 పరుగుల తేడాతో నమీబియాపై గెలిచి ఈ టోర్నీలో సమష్టిగా రాణించి రెండో విజయాన్ని సొంతం చేసుకుంది. మొదట బ్యాటింగ్ చేస్తూ 20 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 199 రన్స్ చేసింది. భారత



సంతతి ఆటగాళ్లు సంజయ్ కృష్ణమూర్తి (33 బంతుల్లో 68 నాటౌట్, 4 ఫోర్లు, 6 సిక్స్‌లు) వీరవిహారానికి తోడు మోనాంక్ పటేల్ (30 బంతుల్లో 52, 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. ఛేదనలో నమీబియా 168/6 వద్దే ఆగిపోయింది. స్టీన్‌క్యాంప్ (39 బంతుల్లో 58, 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), స్మిత్ (31) పోరాడినా ఆ జట్టుకు ఓటమి తప్పలేదు.

# రాహుల్, పడిక్కల్ శతకాలు

**లక్నో:**
రంజీ ట్రోఫీ సెమీస్ పోరును కర్ణాటక తొలిరోజు ఘనంగా ఆరంభించింది. లక్నోలో ఉత్తరాఖండ్‌తో జరుగుతున్న తొలి సెమీస్‌లో స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ (211 బంతుల్లో 141, 11 ఫోర్లు, 5 సిక్స్‌లు), కెప్టెన్ దేవ్‌దత్ పడిక్కల్ (236 బంతుల్లో 148 నాటౌట్, 16 ఫోర్లు, 2 సిక్స్‌లు) భారీ



శతకాలతో రాణించారు. ఈ ఇద్దరి సెంచరీలతో మొదటిరోజు కర్ణాటక 90 ఓవర్లకు 355/2 పరుగుల భారీ స్కోరు సాధించింది. జమ్మూకాశ్మీర్‌తో జరుగుతున్న రెండో సెమీస్‌లో తొలుత బ్యాటింగ్ చేస్తున్న బెంగాల్.. మొదటి రోజు 249/5 చేసింది. సుదీప్ కుమార్ (136 బ్యాటింగ్) సెంచరీ చేశాడు.

## విజృంభించిన హోప్, హోల్డర్..
## సూపర్ 8లో వెస్టిండీస్, నేపాల్ ఔట్..!



పొట్టి ప్రపంచకప్‌లో హ్యాట్రిక్ విజయాలతో వెస్టిండీస్ సూపర్- 8 చేరింది. లీగ్ దశ మూడో మ్యాచ్‌లో నేపాల్‌ను చిత్తు చేసి నాకౌట్ దశకు చేరిన తొలి జట్టుగా నిలిచింది. జేసన్ హోల్డర్(4-27) విజృంభణతో ప్రత్యర్థిని కట్టడి చేసిన విండీస్.. ఆపై స్వల్ప లక్ష్యాన్ని ఊదిపడేసింది. కెప్టెన్ షాయ్ హోప్(61 నాటౌట్), షిమ్రన్ హిట్‌మైర్ (46 నాటౌట్)లు దంచేయడంతో 15.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకుంది. భారీ విజయం.. మెరుగైన రన్‌రేటుతో కరీబియన్ జట్టు సాధించి సూపర్8లో అడుగుపెట్టగా.. నేపాల్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. పొట్టి ప్రపంచకప్‌లో జోరు చూపిస్తున్న వెస్టిండీస్ ఈమధ్యే తమపై సిరీస్ గెలుపొందిన నేపాల్‌ను చిత్తుగా ఓడించింది. 15.2 ఓవర్లలోనే లక్ష్య ఆన్ని చేరుకొని అన్నింటికంటే ముందే సూపర్ 8 దశకు దూసుకెళ్లింది. గత రెండు మ్యాచుల్లో భారీ విజయాలతో టైటిల్ ఫేవరెట్‌గా నిలిచిన విండీస్... ఆదివారం వాంఖడేలో పాల్‌పై 9 వికెట్ల గెలుపుతో నాకౌట్‌కు అర్హత సాధించింది. సీనియర్ ఆల్‌రౌండర్ జేసన్ హోల్డర్(4-27) ధాటికి నేపాల్ బ్యాటర్లు విలవిలలాడారు. ఛేదనలో విండీస్ ఓపెనర్లు బ్రాండన్ కింగ్(22), షాయ్ హోప్(61 నాటౌట్)లు చితక్కొట్టారు. తొలి వికెట్‌కు 44 పరుగులతో శు భారంభిమిచ్చిన ఈ ద్వయాన్ని నందన్ యాదవ్ విడదీసి.. నేపాల్‌కు బ్రేకిచ్చాడు. కానీ, షిమ్రన్ హిట్‌మైర్(46 నాటౌట్) జతగా హోప్ చెలరేగిపోయాడు. వీరిద్దరూ విధ్వంసక ఆటతో నేపాల్ బౌలర్ల ఎత్తులను చిత్తు చేశారు. ఇంకేముంది.. 15.2 ఓవర్లలోనే వెస్టిండీస్ 9 వికెట్లతో జయభేరి మోగించింది.

**దీపేంద్ర ఒక్కడే..**

వరల్డ్‌కప్ సన్నాహక సిరీస్‌లో వెస్టిండీస్‌పై రెచ్చిపోయిన నేపాల్ ఆటగాళ్లు మెగా టోర్నీలో మాత్రం నిరాశపరిచారు. బోణీ కొట్టాలంటే నెగ్గాల్సిన మ్యాచ్‌లో ప్రత్యర్థి బౌలర్లకు దాసోహమయ్యరు. జేసన్ హోల్డర్(4-27) సంచలన బౌలలింగ్‌తో వికెట్ల వేట కొనసాగించగా.. నేపాల్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. పవర్ ప్లేలోనే 3 వికెట్లు.. 46కే ఐదు వికెట్లు కోల్పోయిన ఆ జట్టు 133 రన్స్ చేసిందంటే దీపేంద్ర ఐరీ(58) చలవే. సహచరులు విఫలమైనా అతడు హాఫ్ సెంచరీతో రాణించగా.. ఆఖర్లో సోంపాల్ కమి(26 నాటౌట్) మెరుపులతో పోరాడగలిగే స్కోర్ చేసింది.